



తాగునీటి కోసం రాస్తారోకో చేస్తున్న మహిళలు

కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్న మహిళలు

# పాలమూరులో పాత రోజులు

- తాగునీటి కోసం వీధి పోరాటం
- బోయపల్లిలో ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు
- కౌన్సిలర్‌ను నిలదీసిన ప్రజలు
- పోలీసులతో బలవంతంగా ఆందోళన విరమింపజేసిన కాంగ్రెస్ నేతలు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 1 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో మళ్లీ తాగునీటి ఎద్దడి ప్రారంభమైంది. వారం రోజులనుంచి నీళ్లు రావడం లేదని ఆగ్రహించిన మున్సిపాలిటీ పరిధిలోని బోయపల్లి ప్రజలు బుధవారం రోడ్డెక్కారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ బొడ్రాయి పండుగకు కనీసం మంచినీళ్లు ఇవ్వలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టాలకు నీళ్లు ఇవ్వలేక పండుగ కూడా సక్కగా చేసుకోలేక ఇబ్బందులు పడ్డామన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రోజూ తాగునీరు ఇంటి దగ్గరే పట్టుకున్న తాము.. కాంగ్రెస్ హయాంలో ఈ దుస్థితి వస్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు. ఆందోళన విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న 16వ వార్డు కౌన్సిలర్ మోతిలాల్‌తో వారు వాగ్వాదానికి దిగారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి సరఫరా చేసే పైప్‌లైన్ వద్ద గేటు వాల్వ్ లేకపోవడంతో నీటి సరఫరా ఆగిపోయిందని, ఈ విషయం కౌన్సిలర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇందుకు కౌన్సిలర్ గత చైర్మన్ తనకు సహకరించలేదని చెప్పగా.. 'ఎందుకు అబద్ధాలు మాట్లాడుతున్నావ్.. కేసీఆర్ ప్రభుత్వంలో ఈ ఒక్క గ్రామంలోనే 14 బోర్లు వేసి తాగునీటి ఎద్దడే లేకుండా చేశారు.. కాంగ్రెస్ హయాంలో ఆ బోర్లలో ఉన్న మోటర్లన్నింటినీ ఎత్తుకెళ్లి అమ్ముకున్నారు.. ఈ విషయం నీకు తెలియదా' అంటూ కౌన్సిలర్‌ను నిలదీశారు. అంతటితో ఆగక రాజకీయ స్వార్థం కోసం బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లోకి పోయావని నీటి సమస్య ఎందుకు తీర్చడం లేదని.. ఇప్పుడున్నది మీ చైర్మనే కదా అని ఆగ్రహం వ్యక్తం చేయడంతో కౌన్సిలర్ అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకోకు దిగినా మున్సిపల్ అధికారులు ఎవరూ అటువైపు రాకపోవడంతో తాగునీటి సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించు కూర్చున్నారు. రాస్తారోకో చేయడంతో మహబూబ్‌నగర్-నవాబ్‌పేట రోడ్డుపై అటు ఇటూ వాహనాలన్నీ నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రెండు గంటలు ధర్నా చేయడంతో కాంగ్రెస్ నేతలు పోలీసులతో బలవంతంగా మహిళలను రోడ్డుపై నుంచి పక్కకు నెట్టివేయించారు. ఒక్క రోజులో సమస్య పరిష్కారం కాకపోతే మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని మహిళలు హెచ్చరించారు.

## అబద్ధాలతో అధికారంలోకి..

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, చిత్రంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఉండవెల్లి, మే 1 : రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను నిండా ముంచిందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం అలంపూర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్లమెంట్ ఎన్నికలపై ఉండవెల్లి, మానవపాడు మండలాల బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఆరు గ్యారెంటీలు ఎక్కడ అమలవుతున్నాయో ప్రజలు గమనించాలన్నారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారు తదితర హామీలేవీ అమలు చేయడం లేదని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారు. పదేండ్లలో కనిపించని కరువు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కరువు కాటకాలకు నిలయమైందని విమర్శించారు. నడిగడ్డ బిడ్డ ఆర్‌ఎస్‌పీని కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా నిలిపారని, ఆయన గెలుపునకు అందరం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## సర్కారుకు బుద్ధి చెప్పాలి

- అభ్యర్థుల గత చరిత్ర చూసి ఓటేయండి..
- బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



వెల్దండ రోడ్ షోలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

వెల్దండ, మే 1 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం మండలకేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జెడ్పీటీసీ విజితారెడ్డి పాల్గొనగా జనం భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గురుకులాల కార్యదర్శి ఉన్న సమయంలో ఎంతో మంది పేద, బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేశానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి, బీజేపీ అభ్యర్థి ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. అభ్యర్థుల గత చరిత్ర చూసి ప్రజల ఓట్లు వేయాలని కోరారు. వెల్దండలో ఏకలవ్య గురుకుల, ఎస్సీ బాలికల వసతి గృహం ఏర్పాటుకు తాను ఎంతో కృషి చేశానని గుర్తు చేశారు. జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్‌పీని అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్టారాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రావు, యాదగిరి, చంద్రమోహన్‌రెడ్డి, తిర్మల్‌రావు, కొండల్, శేఖర్, శ్రీను, మందిరం మల్లేశ్, ప్రవీణ్, ఎంఎస్‌గౌడ్, లింగం, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుకను గెలిపిద్దాం

- బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్‌పీని ఆశీర్వదించండి
- తెలకపల్లి ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



అనంతసాగర్‌లో ఓటు అభ్యర్థిస్తున్న మర్రి



బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

నాగర్‌కర్నూల్, మే 1: అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన బీఆర్‌ఎస్‌ను కాదని, ఉన్న పథకాలను ఊడగొడుతున్న కాంగ్రెస్‌ను ఎన్నుకోవడంతో పాలిచ్చే బర్రెను వదిలి దున్నపోతును ఇంటి ముందు కట్టేసుకున్నట్లుగా ప్రజల పరిస్థితి మారిందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే మర్రి బుధవారం మండలంలోని అనంతసాగర్, గడ్డంపల్లి, కార్వంగ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ పార్లమెంట్‌లో మన తరపున అన్ని సమస్యలపై నిలదీసేవాడు మన ప్రవీణ్‌కుమార్ సార్ అని, అందుకే కారుకు ఓటువేసి సారుకు మద్దతు ఇద్దామని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో మీరంతా మోసపోయారని, ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేకపోతున్నారని విమర్శించారు. రూ.2లక్షల రుణమాఫీ అని రైతులను, రూ.4 వేల ఫించన్ అని తల్లులను నట్టేటా ముంచారన్నారు. ఉద్యోగాలని చెప్పి నిరుద్యోగ యువతను ఆగం చేశారని, వారి మోసకారి గ్యారెంటీలను నమ్మి మరోసారి మోసపోవద్దని సూచించారు. ఆయన వెంట పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

- బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు



అచ్చంపేటలో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేట, మే 1 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని 8,18వ వార్డుల్లో బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. విద్యావంతుడైన ఆర్‌ఎస్‌పీని గెలిపిస్తే పేదల గొంతుక ఢిల్లీ గడ్డపై గర్జిస్తుందన్నారు. కాంగ్రెస్ కరువును వెంట తెచ్చిందన్నారు. పంటలు ఎండిపోయినా, పట్టించుకోలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. అక్రమ ఇసుక, అక్రమ మైనింగ్ మాఫియా రాజ్యమేలుతుందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పి ఆర్‌ఎస్‌పీని ఎంపీగా గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, కౌన్సిలర్లు అప్పశివ, రమేశ్‌రావు, శివ, బాలరాజు, నాయకులు శంకర్, నాగరాజు, వెంకటస్వామి, పెంటయ్య, హరీశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ విజయానికి పని చేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, మే 1: ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి విజయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మహబూబ్‌నగర్ వార్డు, మండలం, హన్వాడ మండలం కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ నేటి నుంచి ప్రతి కార్యకర్త ఇంటింటికీ తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లు అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి ఓటు వేసేలా ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ముడా మాజీ చైర్మన్ వెంకన్న, గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, వైస్‌చైర్మన్ గణేశ్, డీసీసీ వైస్‌చైర్మన్ వెంకటయ్య, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, శివరాజ్ పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## బూటకపు హామీలతో కాలయాపన

- 420 వాగ్దానాలను పట్టించుకోని రేవంత్ సర్కారు
- ఎంపీ ఎన్నికల్లో మన్నె మళ్లీ విజయం సాధించడం ఖాయం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేదికపై మన్నె, రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న చిట్టెం

నారాయణపేట, మే 1 : అసెంబ్లీ ఎన్నికల్లో 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని పట్టించుకోకపోగా.. ఎంపీ ఎన్నికల్లో సైతం బూటకపు హామీలతో గెలవాలనే ప్రయత్నం చేస్తున్నదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దుయ్యబట్టారు. మండలకేంద్రంలో బుధవారం కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మన్నె భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నారన్నారు. ఆయన కృషితోనే రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, రైల్వే బ్రిడ్జిల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఎంపీ మన్నె మాట్లాడుతూ గతంలో ఏ ఒక్క నాయకుడు కూడా రాష్ట్ర సమస్యలపై తాను మాట్లాడినన్ని సార్లు పార్లమెంట్‌లో మాట్లాడలేదన్నారు. జాతీయ రహదారుల డివిజన్ కార్యాలయాన్ని సాధించామన్నారు. ఎంఎస్‌ఎన్ ఫౌండేషన్ ద్వారా ఏడు అంబులెన్స్‌లను అందజేశామని గుర్తు చేశారు. మరోమారు అవకాశం ఇస్తే ప్రజల తరపున పార్లమెంట్‌లో గళం విప్పి రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ పేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ 'ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలి' అనే వాస్తవాన్ని గ్రహించి ఎంపీ ఎన్నికల్లో మన్నెను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలు అమలైతే కాంగ్రెస్‌కు.. లేదంటే బీఆర్‌ఎస్‌కు ఓటు వేయమని ప్రజలకు సూచించాలన్నారు. పాత నీరు పోతేనే కొత్త నీటికి విలువ వస్తుందని పార్టీ మారుతున్న వారిని ఉద్దేశించి అన్నారు. రాబోయే కాలంలో కేసీఆర్‌కే ప్రజలు పట్టం కడతారన్నారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సప్ప, జెడ్పీటీసీ లావణ్య, సీనియర్ నాయకులు భీమయ్యగౌడ్, కాన్‌కుర్తి వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రవి, జ్యోతి, శ్రీనివాస్‌రెడ్డి, భీంరెడ్డి, జగదీశ్, ప్రతాప్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డితోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




### కర్రు కాల్చి వాత పెట్టాలి..

అమలుకాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలిచ్చి ప్రజలను నిలువునా మోసం చేశాడు. ఆరు గ్యారెంటీల్లో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని తీసుకొచ్చి తగాదాలు సృష్టించారు. కేసీఆర్ హయాంలో ప్రజల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేశాం. రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్, ఆడబిడ్డ పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తోపాటు కేసీఆర్ కిట్ వంటి పథకాలు విజయవంతంగా అమలు చేశాం. ప్రజలు కాంగ్రెస్‌ను మరోసారి నమ్మవద్దు. వారిని నమ్మితే మనల్ని పూర్తిగా వంచించడం ఖాయం. అందుకే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలి. తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా వంటి ప్రయోజనాలను కాపాడుకోవాలంటే గులాబీ పార్టీ ఎంపీలు ఉండాలి. అందుకే బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించాలి.

- మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ

## మోసకారి కాంగ్రెస్‌ను నమ్మొద్దు

- దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
- భూత్పూర్ మండలంలో ప్రచారం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, మే 1 : కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలను ఇచ్చి ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని తాటిపర్తి, కరివెన, వెల్కిచర్ల గ్రామాల్లో బుధవారం ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ భగీరథ, ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా పథకాలను పూర్తిగా అటకెక్కించే ప్రయత్నం చేస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీళ్లను పుష్కలంగా పంపిణీ చేశారని నేడు కాంగ్రెస్ హయాంలో మహిళలు మళ్లీ బిందెలు పట్టుకొని రోడ్లపైకి వస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా గుళ్లు, అక్షింతలతో రాజకీయం చేస్తున్నారన్నారు. మన రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీని, నవోదయ పాఠశాలను కూడా మంజూరు చేయలేదని అలాంటి పార్టీలు మనకు అవసరం లేదన్నారు. అందుకే కాంగ్రెస్, బీజేపీలను ఓడించి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు సత్తూర్ నారాయణగౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు సాయిలు, నర్సింహాగౌడ్, సత్యనారాయణ, మురళీధర్‌గౌడ్, వెంకటయ్య, పద్మాజక్కిరెడ్డి, ఫసియొద్దీన్, ఆంజనేయులు, పర్వతాలు, నాగయ్య, బాలస్వామి, గౌస్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల కోసం దిగజారుతున్న సర్కారు

- మోదీతో పేదలు, కార్మికులకు ఒరిగిందేమీ లేదు
- కేసీఆర్ హయాంలోనే మేలు
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- నిండా ముంచిన కాంగ్రెస్‌ను చావుదెబ్బ కొట్టాలి : ఆర్‌ఎస్‌పీ




కార్మికులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

వనపర్తి, మే 1 : తెలంగాణ తొలి ఉద్యమం నుంచి మలిదశ ఉద్యమం వరకు కాంగ్రెస్ ప్రజలను నయవంచన చేస్తూనే ఉన్నదని, ఓట్ల కోసం ఎంతకైనా దిగజారుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తాలో పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పాల్గొని జెండాను ఎగురవేశారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి మోదీ సర్కారు చేసిందేమీ లేదని, పేదలు, కార్మికులకూ ఒరిగిందేమీ లేదన్నారు. మోదీ చేసిందంతా అదానీ, అంబానీలకు రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టడం తప్పా మరొకటి లేదని విమర్శించారు. కేవలం కార్మికుల మేలు జరిగిందంటే కేసీఆర్ హయాంలోనేనన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను హైజాక్ చేసి ఇప్పుడు ఇచ్చేదాని కంటే మరింత ఎక్కువ ఇస్తానని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు, చట్టాలను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. అనంతరం ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఓట్ల కోసం ఆరు గ్యారెంటీల అమలు పేరుతో ప్రజలను నిండా ముంచిన కాంగ్రెస్‌ను వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చావు దెబ్బ కొట్టాలని పిలుపునిచ్చారు. అధికారం కోసం ఎన్ని మోసపూరిత వాగ్దానాలు చేసే అలవాటు కాంగ్రెస్ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి మహిళకు రూ.2500 నెలకు అందిస్తామని హామీ ఇచ్చి నేడు వాటి ప్రస్తావనే తేవడం లేదన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.12 వేల ఆర్థిక సాయం ఇస్తానన్న హామీని అమలు చేయడం లేదన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, వరికి రూ.500 బోనస్ ఇస్తామని, పెన్షన్లు రూ.4 వేలు పెంచుతామని, కల్యాణలక్ష్మి లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్న హామీలన్నీ అటకెక్కించారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలకు కార్మిక, కర్షక లోకం సమస్యలు పట్టవని విమర్శించారని, కార్మికుల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంపు లు నిర్వహించి, కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

### మాజీ మంత్రితో కలిసి ఆర్‌ఎస్‌పీ మార్నింగ్ వాక్

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపారని, హరిత విప్లవం సాధించిన మరో స్వామినాథన్ అని ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ కొనియాడారు. గతంలో ఉన్న పార్లమెంట్ సభ్యులు సమర్థతలేక కేంద్ర నిధులు ఉపయోగంలోకి తీసుకురాలేని దద్దమ్మలన్నారు. బీఆర్‌ఎస్ నుంచి తనను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. బుధవారం ఉదయం ఎకో పార్కులో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి ఆర్‌ఎస్‌పీ వాకర్స్‌ను కలిశారు. అనంతరం వాకర్స్‌తో కలిసి వ్యాయామం చేసి షటిల్ ఆడారు. వారి వెంట ఎన్నికల ఇన్‌చార్జి బైకని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, పార్లమెంట్ మీడియా ఇన్‌చార్జి అభిలాష్‌రావు, విజయ్‌కుమార్, నాయకులు వాకిటి శ్రీధర్, లక్ష్మయ్య, అశోక్, తిరుమల్, గంధం బాలపీరు, పరంజ్యోతి, మాణిక్యం, ధర్మ, మహేశ్వరరెడ్డి, కౌన్సిలర్ కంచెరవి, నాగన్నయాదవ్, కృష్ణ, మహేశ్, గిరి, జోహెబ్ పాల్గొన్నారు.



వ్యాయామం చేస్తున్న ఆర్‌ఎస్‌పీ, చిత్రంలో నిరంజన్‌రెడ్డి